క్లుప్తంగా

రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలి



రోడ్డు పనులను తనిఖీ చేస్తున్న ఏఈ వెంకటప్రకాష్

సి.బెళగల్: రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని పీఆర్ ఏఈ వెంకటప్రకాష్ సూచించారు. ఆయన గురువారం మండలంలోని సి.బెళగల్ గ్రామం నుంచి సంగాల గ్రామం వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. పలుకుదొడ్డి వరకు జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. మండలంలో పంచాయతీరాజ్ శాఖ అధ్వర్యంలో దాదాపు రూ.3 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గురువారం తడి మిశ్రమ కంకర పనులు జరుగుతుండగా, వారు పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్ శ్రీనివాసులుకు సూచించారు. గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ అనురాధ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గడివేముల: మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్ ఆవరణలో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో ఉదయానంద ఆసుపత్రికి చెందిన డాక్టర్లు గురువారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు రామేశ్వర రెడ్డి, ముఖేష్ రెడ్డి, సౌమ్యరెడ్డి పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి స్కానింగ్‌లు, ఈసీజీ, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలను అందజేశారు. వైద్య సిబ్బందితో పాటు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రహేలా

పాణ్యం: స్థానిక సీహెచ్‌సీలో గురువారం మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ పథకంలో భాగంగా ఈ వైద్య శిబిరం నిర్వహించినట్లు సీహెచ్‌సీ డాక్టర్ వేణుగోపాల్‌క్రిష్ణ గురువారం తెలిపారు. మహిళలకు రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, తదితర వ్యాధులపై చికిత్సలు చేసినట్లు చెప్పారు. గైనకాలజిస్టు రహేలా ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. సుమారు 150 మంది మహిళలకు వైద్య సేవలందించినట్లు చెప్పారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు, ఈఓ ఆనందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో కార్మికులందరికీ వాహనమిత్ర ఇవ్వాలి



తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ, ఆటో యూనియన్ నాయకులు

కోడుమూరు రూరల్: రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఆటో కార్మికుడికి వాహనమిత్ర పథకాన్ని వర్తింపచేయాలని ఏఐటీయూసీ జిల్లా జిల్లా అధ్యక్షుడు మధు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో అమలు చేస్తున్న వాహనమిత్ర పథకం, ఆటో కార్మికుల సమస్యలపై గురువారం ఆటో కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్త్రీశక్తి పథకం వల్ల రాష్ట్రంలో లక్షలాది మంది ఆటో కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి నెలకొందని వాపోయారు. ఆటో కార్మికులను ఆదుకునేందుకంటూ కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న వాహన మిత్ర పథకాన్ని ఎలాంటి షరతులు లేకుండా ప్రతి ఆటో కార్మికుడికి వర్తింపజేయడంతో పాటు, గడువును పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి రాముడు మాట్లాడుతూ ఆటో కార్మికులకు ప్రత్యామ్నాయంగా ఉపాధి చూపించడంతో పాటు, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ఆటో తోలుకుని జీవించే కార్మికులకు ప్రతి నెల జీవనోపాధి కింద నెలకు రూ.5 వేలను అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటో యూనియన్ నాయకులు దొలబాబు, జంబయ్య, ఉరుకుందు, సురేంద్ర, మద్దిలేటి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాత్యాయనీ దేవిగా వల్లెలాంబ



కాత్యాయనీ దేవిగా సుంకులా పరమేశ్వరి



హుసేనాపురంలో..



నిడ్జూరులో..



కాత్యాయనీ దేవిగా వెంకాయపల్లె ఎల్లమ్మ



ఇ.తాండ్రపాడులో..



కన్యకా పరమేశ్వరి



కాత్యాయనీ దేవిగా ఉత్సవమూర్తి



రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో..

కాత్యాయనీ దేవిగా దుర్గమ్మ



వల్లెలాంబ దేవికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



కాత్యాయనీ దేవిగా..



అన్నపూర్ణదేవిగా వాసవీ కన్యాకా పరమేశ్వరి

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ, చౌడేశ్వరీ దేవి, కాళికామాతా, శ్రీరాములమ్మ, తులజా భవాని, అంబా భవాని అమ్మవార్లు కాత్యాయనీ దేవిగా దర్శనమివ్వగా ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. వల్లెలాంబదేవి ఆలయంలో కాత్యాయినీ దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి గురువారం రాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకీ సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో వెంకటేష్, గోవిందరెడ్డి భక్తులకు అన్నదానం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- గూడూరు మండలంలోని కె.నాగలాపురంలో వెలసిన సుంకులపరమేశ్వరీ మాత కాత్యాయినీ దేవి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు విశేష పూజలు నిర్వహించారు.
- **ఓర్వకల్లు:** మండల పరిధిలోని రాగమయూరి సరస్వతీ దేవాలయంలో పురోహితులు యశోధరశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కాత్యాయనీ రూపంలో అలంకరించారు. అలాగే ఓర్వకల్లు, నన్నూరు గ్రామాల్లో చౌడేశ్వరీ మాతకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కాత్యాయనీ అలంకరణలో ముస్తాబు చేశారు. లొద్దిపల్లె, నన్నూరు గ్రామాలలో ప్రత్యేక మండపాలతో పాటు, హుసేనాపురం సంతమార్కెట్‌లో కొలువుంచిన దుర్గాదేవికి పురోహితులు జంధ్యాల మనోహర్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.
- **కర్నూలు(రూరల్):** మండలంలోని నిడ్జూరు, మునగాలపాడు పరిధిలో తుంగభద్ర నది ఒడ్డున మామిడితోటలో వెలసిన దుర్గమ్మను భక్తులు కాత్యాయనీగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కాయకర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిమ్మకాయల దండలు, బంతిపూల మాలలు సమర్పించారు. వెంకాయపల్లె ఎల్లమ్మను కాత్యాయనీగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- **సి.బెళగల్:** సి.బెళగల్‌లోని ఈశ్వరాలయంలో ప్రతిష్ఠించిన పంచలోహ అమ్మవారు నాల్గవ రోజు కాత్యాయనీ దేవిగా దర్శనమిచ్చారు. భక్తులు కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అలాగే కోమటి వీధిలోని వాసవీ కన్యక పరమేశ్వరి దేవి, కొత్త బస్టాండ్‌లోని పార్వతి ఆలయంలో అమ్మవారిని కాత్యాయనీ దేవిగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.
- **పాణ్యం:** పాణ్యంలో దేవదాయ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించారు. అలాగే హైందవశక్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని నిర్వాహకులు కాత్యాయనీ దేవిగా అలంకరించారు. పాణ్యం రైల్వే స్టేషన్ సమీపంలో కనకదుర్గ ఆలయంలో అమ్మవారు అష్టలక్ష్మీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, మండపాల నిర్వాహకులు అమ్మవారికి విశేష పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.
- **గడివేముల:** గడివేములలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరి గురువారం అన్నపూర్ణ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అర్చకులు వసంతలక్ష్మి, సత్యనారాయణ శర్మ అన్నపూర్ణాదేవికి కుంకుమార్చన, శివాభిషేకం, మహా మంగళహారతి తీర్థ ప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



కాటసాని రాంభూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కల్లూరు: వైఎస్సార్‌సీపీలో వివిధ విభాగాల్లో పదవులు పొందిన వారందరూ బాధ్యతయుతంగా పని చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి సూచించారు. వైఎస్సార్‌టీయూసీ అధికార ప్రతినిధిగా నియమితులైన ఉలిందకొండ రమణారెడ్డి గురువారం కాటసాని రాంభూపాల్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు పదవులు వరిస్తాయన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పదవులు పొందిన వారందరూ సమన్వయంగా, సమష్టిగా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశాయాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. కార్పొరేటర్ లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లా వెంకట రమణారెడ్డి, శివశంకర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, చాంద్‌బాష, సాయి, తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వే త్వరితగతిన పూర్తి చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ నవ్య

ఓర్వకల్లు: నేషనల్ ఇండస్ట్రీ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఐసీడీసీ)కి కేటాయించిన భూములలో సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని శకునాల గ్రామ రెవెన్యూ పరిధిలో సుమారు 737 ఎకరాలను 2017-18 లో అలినేషన్ పద్ధతిలో గ్రీన్‌కో సంస్థకు కేటాయించడం జరిగిందన్నారు. దీంతో సదరు భూముల్లో సోలార్ ప్యానల్స్ నిర్మించారు. ప్రస్తుతం అలినేషన్ పద్ధతిని రద్దు చేసి, లీజ్ పద్ధతిలో ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిదన్నారు. సదరు భూములను జేసీ పరిశీలించారు. సవరించిన విధానాన్ని బట్టి త్వరలో లీజ్‌కు దరఖాస్తు చేసుకోవాలని గ్రీన్‌కో కంపెనీ అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని ఎన్‌ఐసీడీసీకి కేటాయించిన భూములపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. మండలంలోని మీదివేములలో 66 ఎకరాలు, ఎన్ కొంతలపాడులో 5 ఎకరాలు, ఉప్పలపాడులో 45 ఎకరాలను ఎన్‌ఐసీడీసీకి కేటాయించినట్లు తెలిపారు.. సదరు భూములకు సంబంధించిన రైతులతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని, త్వరలో సర్వే పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా మండలంలోని 8 గ్రామాల్లో ఏపీఐఐసీ కోసం కేటాయించిన 750 ఎకరాల భూములను సర్వే చేసి వీలైనంత త్వరగా ఏపీఐఐసీ వారికి అప్పగించాలన్నారు. ఆర్డీఓ సందీప్‌కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్, డిప్యూటీ తహసీల్దార్ సతీష్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాపై విచారణ

సాక్షి ఎఫెక్ట్



కోడుమూరు కోటవీధిలో సరఫరా అయిన కొళాయి నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాముడు

కోడుమూరు రూరల్: పట్టణంలోని కాలనీలకు హంద్రీ నది నుంచి కొళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటిపై ఎంపీడీఓ రాముడు గురువారం విచారణ చేపట్టారు. పట్టణంలోని కాలనీలకు కొళాయిల ద్వారా కలుషితమైన నీరు సరఫరా అవుతుందంటూ గురువారం 'సాక్షి' దినపత్రికలో 'కలుషిత నీటి సరఫరా' శీర్షికతో వార్తా కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఎంపీడీఓ రాముడు గురువారం ఉదయం కోటవీధిలో స్వయంగా పర్యటించి నీటి సరఫరాపై ప్రజలను ఆరా తీశారు. అనంతరం హంద్రీ నదికి వెళ్లి పట్టణానికి మంచినీటిని సరఫరా చేసే బోర్లను పరిశీలించారు. సాధ్యమైనంత వరకు నీరు కలుషితం కాకుండా చూడాలని, క్లోరినేషన్ చేసిన తర్వాతే కొళాయిలకు విడుదల చేయాలని వాటర్ వర్కర్స్‌ను ఆదేశించారు.

సమస్యల వలయంలో శివప్ప నగర్



బురదమయంగా మారిన రోడ్డును చూపుతున్న సీపీఎం నాయకులు

కల్లూరు: కల్లూరు అర్బన్ 35వ వార్డు పరిధిలోని శివప్ప నగర్ సమస్యల వలయంలో చిక్కుకుందని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యుడు సుధాకరప్ప అన్నారు. గురువారం సీపీఎం బృందం శివప్ప నగర్‌లో పర్యటించింది. ఈ సందర్భంగా సుధాకరప్ప మాట్లాడుతూ.. కాలనీ ఏర్పడి సుమారు 20 ఏళ్లు అవుతున్నా మౌలిక వసతులు కల్పించలేదన్నారు. రోడ్లు సరిగా లేకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారి బురదమయంగా మారుతుందన్నారు. రోడ్లపై వర్షపు నీరు నిలిచి దోమలు, లార్వాలు, ఈగలకు నెలవుగా మారుతోందని వాపోయారు. పారిశుద్ధ్య లోపంతో పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, సామూహిక మరుగుదొడ్లలో నీటి సౌకర్యం లేక దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీపీఎం నాయకులు రామకృష్ణ, పరమేష్, సూర్య నారాయణ, బీరప్ప, రాజన్న, లక్ష్మీదేవి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి



పాణ్యంలో స్వచ్ఛతా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు



సి.బెళగల్లో శుభ్రత కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ రాణెమ్మ



శుభ్రత పనులు చేపడుతున్న ఉద్యోగులు

కల్లూరు: ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం స్వచ్ఛతా హీ సేవలో భాగంగా 'ఏక్ దిన్, ఏక్ గంటా, ఏక్ సాథ్' కార్యక్రమంలో భాగంగా ఉలిందకొండ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మాట్లాడుతూ.. ఇంటింటి నుంచి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా అందించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించాలన్నారు. పారిశుద్ధ్యం లోపిస్తే సంబంధిత అధికారులు బాధ్యులవుతారని హెచ్చరించారు. సర్పంచ్ ఎం.సుంకులమ్మ, ఎంపీడీఓ నాగేశ్వాచలరెడ్డి, డిప్యూటీ ఎంపీడీఓ నగేష్, ఉలిందకొండ సింగిల్ విండో చైర్మన్ రమణ, పంచాయతీ కార్యదర్శి చెన్నయ్య, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలి

పాణ్యం: ఆరోగ్యకర గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం పాణ్యంలో నిర్వహించిన స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో గ్రామాలను శుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి రోజు పారిశుద్ధ్య కార్మికులకు సహకరించి తడి, పొడి చెత్తను వేరువేరుగా అందించాలన్నారు. ఎక్కడా చెత్త నిల్వలుండరాదన్నారు. పారిశుద్ధ్యం లోపిస్తే ఏర్పడే సమస్యలను ప్రజలకు తెలియజేశారు. పంచాయితీ సిబ్బంది తీసుకెళ్తున్న చెత్తను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఈఓఆర్డీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని ప్రభుత్వ, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాలను శుభ్రంగా ఉంచుకోవడం అందులో పనిచేస్తున్న ఉద్యోగుల బాధ్యత అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణయ్య అన్నారు. గురువారం ఏక్ దిన్, ఏక్ గంట్, ఏక్ సాత్ నినాదంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామి సిబ్బందితో కలిసి శుభ్రతా కార్యాక్రమం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సుధీర్, మెహతాజ్, ఏపీఓ మద్దేశ్వరమ్మ, సీఓలు నాగేంద్ర, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సి.బెళగల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. గురువారం మండలంలో స్వచ్ఛతే సేవా కార్యక్రమం చేపట్టారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధిహామీ సిబ్బందితో కలిసి శుభ్రత పనులు చేపట్టారు. ఎంపీడీఓ, అధికారులు చీపుర్లు పట్టి చెత్తా చెదారాన్ని శుభ్రం చేశారు.అలాగే పోలకల్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోసేనాయక్‌తో కలిసి చెత్త తొలగింపు పనులలో ఎంపీడీఓ పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో మౌలిక వసతులు కరువు

- ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు
- చిన్న వర్షానికే చిత్తడిగా మారుతున్న రహదారులు
- పట్టించుకోని అధికారులు





పందిపాడు ఇందిరమ్మ కాలనీలో బురదమయంగా మారిన రోడ్లు

కల్లూరు: కల్లూరు అర్బన్ 28వ వార్డు పరిధిలోని పందిపాడు ఇందిరమ్మ కాలనీలో ప్రజలు మౌలిక వసతుల లేమితో ఇబ్బందులు పడుతున్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కర్నూలు నగరం, కల్లూరు అర్బన్ ప్రాంతంలోని పేదలందరికీ ఈ కాలనీలో ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. వందల మందికి ఇంటి స్థలాలు మంజూరు చేశారు. గత 15 సంవత్సరాలుగా కాలనీకి కనీసం రోడ్లు, నీరు, వీధి లైట్లు, డ్రైనేజీ కాలువలు వంటి మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పందిపాడు ఇందిరమ్మ కాలనీలో ప్రజల సౌకర్యార్థం విద్యుత్ కనెక్షన్ అందించింది. దీంతో చాలా మంది ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. కొందరూ ఇళ్లు పూర్తి చేసి నివాసం ఉంటున్నారు. అయితే కాలనీలో రోడ్లు, డ్రైనేజీ కాలువలు సరిగా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో ఇళ్ల నుంచి బయటకు రావాలంటే భయమేస్తోందని వాపోతున్నారు. తాగడానికి నీటి కోసం మూడు కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సదుపాయలు కల్పించాలి



కాలనీలో మౌలిక సదుపాయాలు సరిగా లేవు. తాగడానికి మంచి నీరు సరిగా రావడం లేదు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉంది. అధికారులు స్పందించి కాలనీలో మౌలిక వసతులు కల్పించి సమస్యలను పరిష్కరించాలి.

– శారదమ్మ, పందిపాడు ఇందిరమ్మ కాలనీ

రోడ్లు నిర్మించాలి



కాలనీలో రోడ్లు నిర్మించాలి. చిన్న వర్షానికే కాలనీలో వీధులు బురదమయంగా మారుతున్నాయి. తాగునీరు సకాలంలో రాకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. రాత్రి సమయంలో బయటకు రావాలంటే భయం భయంగా ఉంటుంది. అధికారులు స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి.

– పద్మ, పందిపాడు, ఇందిరమ్మ కాలనీ

నేడు మంత్రాలయం పీఠాధిపతి రాక

కోడుమూరు రూరల్: మంత్రాలయం శ్రీరాఘవేంద్ర స్వామి మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు శుక్రవారం కోడుమూరుకు విచ్చేస్తున్నట్లు అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యుడు నలుబోలు భాస్కర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు కోడుమూరులోని కర్నూలు రోడ్డులో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి ఆలయాన్ని సందర్శించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, హిందూ ధార్మిక ప్రవచనాలు, ఆధ్యాత్మిక సందేశం ఇస్తారన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ధూమపానంతో క్షయ ముప్పు

కర్నూలు(రూరల్): పొగ తాగే అలవాటు ఉన్న వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని వైద్యాధికారి తేజ తెలిపారు. ఆయన గురువారం మండల పరిధిలోని గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని దిగువపాడులో టీబీ ముక్త అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రెండు వారాలకు మించి దగ్గు ఉన్న వారు టీబీ గళ్ల పరీక్షలు, ఎక్స్‌రే చేయించుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది నిక్షయ్‌వాహన్, నిక్షయ్ శిబిరాలు ఏర్పాటు చేసి జన భగీదారిలో భాగంగా గ్రామాల్లోని ప్రజలకు టీబీ గురించి వివరించాలన్నారు. పంచాయతీ సెక్రటరీ వినిత, టీబీ సూపర్‌వైజర్ నిషిత్, పీహెచ్‌ఎన్ విజయ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు దామోదరం పేరు పెట్టాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జిల్లాకు దామోదరం సంజీవయ్య పేరు పెట్టాలని సంజీవయ్య జిల్లా సాధన సమితి గౌరవాధ్యక్షుడు నక్కలమిట్ట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దాసరి రామశేషయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని కలిసి విన్నవించారు. నాయకులు వి.కృష్ణయ్య, దామోదరం రాధాకృష్ణమూర్తి, వర్మ, రంగస్వామి ఉన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కోడుమూరు, పాణ్యం
70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)
Office mail : sakshiknladvt@gmail.com